వేసవిలో పాడిని సంరక్షించుకుందాం

- జాగ్రత్తలు అవసరమంటున్న పశువైద్యులు
- ఆదమరిస్తే పాల ఉత్పత్తి తగ్గే అవకాశం
- పశువులకు అత్యవసర వైద్యం కోసం 1962కు కాల్‌ చేయాలి
- చల్లటి పందిర్ల కిందనే పశువులను ఉంచాలి
- పచ్చిగ్రాసంతో పాటు, విటమిన్‌ మందులతో నీరసం దూరం



షెడ్డులో ఉన్న పాడి గేదెలు

పాణ్యం: పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. పాడి బర్రెలు, ఆవులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినా, తక్షణ వైద్య సాయం అవసరమైనా 1962 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేస్తే చాలు క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్‌ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పాడి పశువులను కాపాడుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. చలువ పందిర్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని చెబుతున్నారు.

పాల ఉత్పత్తి తగ్గకుండా

ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో రేకుల షెడ్లలో పాడి బర్రెలు, ఆవులను ఉంచే రైతులు షెడ్డును గడ్డితో కప్పివేయాలి. వడగాలులు తగలకుండా పక్కలకు నీటితో తడిపిన జనుము సంచులను వేలాడదీయాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటితో తడిపితే పాడి పశువులకు ఎండ తీవ్రత అంతగా ఉండదు. అంతేగాక పారగడ్డి, పచ్చగడ్డి, ఎండు చొప్ప, వరి గడ్డి, మినుము, పెసర పొట్టు, వేరుశనగ పొట్టు అధికంగా వేయాలి. దీని వల్ల రోజులాగే పాల ఉత్పత్తి తగ్గకుండా చేసుకోవచ్చు. అలాగే విటమిన్‌ మందులను వాడాలి.

మధ్యాహ్నం కల్లా నీడకు చేరాలి

ప్రతి రోజు పాడి పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో మార్పులు చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 6 గంటలకు మేతకు తీసుకెళ్లి 11 గంటలకల్లా నీడకు చేర్చాలని చెబుతున్నారు. అలాగే సాయంత్రం పాలు పితికిన తర్వాత పచ్చిక బైళ్లలోకి తీసుకెళితే నీరసం తదితర ఇబ్బందులు రావని అంటున్నారు. బర్రె, ఆవులకు రోజు వేసే దాణా కంటే వేసవిలో అదనంగా పచ్చిగ్రాసం వేయాలని, దీనికి తోటు విటమిన్‌ మందులు వాడితే పాల ఉత్పత్తి తగ్గకుండా కాపాడుకునేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు.

అందుబాటులో వైద్యం, మందులు



వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాడి పశువుల సంరక్షణకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గాలి కుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్‌ ఇస్తున్నాం. ' పశు విజ్ఞాన బడి' ద్వారా పాడి రైతులకు అవగాహన కల్పించాం. పశువులకు అధికంగా నీళ్లు తాపాలని సూచించాం. పాల ఉత్పత్తి తగ్గకుండా 'సమ్మర్‌ మెనేజ్‌మెంట్‌ కార్యక్రమం ' నిర్వహిస్తున్నాం. వేడి గాలల నుంచి పశువులను కాపాడుకోవాలి. మినరల్‌ మిక్చర్‌, విటమిన్‌ ఏడీఈ లిక్విడ్‌ అందుబాటులో ఉంచాం. అలాగే పాడి పశువులకు ఆరోగ్యం బాగలేకపోయినా, ఏదైనా ప్రమాదం జరిగినా రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ ఫోన్‌ చేస్తే తక్షణమే అంబులెన్స్‌ ద్వారా పశువైద్యులు వచ్చి చికిత్స అందిస్తారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కమలాకర్‌, పశుసంవర్ధశాఖ ఏడీ, పాణ్యం

క్లుప్తంగా

ఉదయాన్నే పనుల్లోకి రావాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌

కోడుమూరు రూరల్‌: వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలంతా ఉదయం త్వరగా పనుల్లోకి వచ్చి మధ్యాహ్నంలోగా ముగించుకొని వెళ్లాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ సూచించారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ తనిఖీ చేసి ఉపాధి సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకల్లా పనుల్లోకి వెళ్లి మధ్యాహ్నంలోగా ముగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.250 వరకు వేతనం పడుతుందని, ప్రతి కూలీ పనుల్లోకి వచ్చిన సమయంలో రెండుమార్లు హాజరు తప్పక వేయించుకోవాలన్నారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వారందరికీ ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఏపీఓ రమాదేవి వెంట ఉన్నారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ



ఎంపీడీఓ కార్యాలయంలో కాల్యెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు సంవత్సర క్యాలెండర్‌లను ఆ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు కమిటీ అధ్యక్షుడు నాగయ్య బుధవారం స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్‌, వెనుకబడిన తరగతుల కార్యాలయలో వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో ఉగాది పండగ విశిష్టతను వివరించారు. ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, వెనుకబడిన తరగతులు కార్యాలయ సిబ్బంది, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

29 నుంచి కబడ్డీ పోటీలు

కర్నూలు (న్యూటౌన్‌): ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు కె.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలని పేర్కొన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.40 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.4 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వివరాలకు 99896 42989 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గుముఖం

కల్లూరు: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. బుధవారం బొల్లవరం గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ.. ప్రతి రైతు ఎకరా పొలంలో 30 రకాల నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు.

విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి



గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో రైతు ఏదుల వెంకటస్వామికి చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌ తగిలి మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం తన పొలంలో ఎద్దులను మేపుకుంటుండగా పక్కనే ఓ వైపు ఒరిగిఉన్న స్తంభానికి తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్‌ వైర్లు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందన్నారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటకృష్ణారెడ్డి పరామర్శించారు.

25న మండల మీట్‌

గూడూరు: ఈ నెల 25న గూడూరు మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సునీత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

జీఓ - 21 రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్‌): పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఆటో కార్మికులను పీడించి వసూలు చేసే ఈ చలాన్లకు అనుకూలమైన జీఓ 21ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌.మునెప్ప డిమాండ్‌ చేశారు. బుధవారం కలెక్టరేట్‌ ఎదుట ఆటో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. నాయకులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు బస్సు ఏర్పాటు



ఆర్టీసీ బస్సు వద్ద సి.బెళగల్‌ గురుకులం ఇంటర్మీడియెట్‌ విద్యార్థులు

సి.బెళగల్‌: స్థానిక డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల కళాశాల ఇంటర్మీడియెట్‌ విద్యార్థులకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్‌ బాలరాముడు తెలిపారు. కళాశాలలో చదువుతున్న ఇంటర్‌ విద్యార్థులకు పబ్లిక్‌ పరీక్షల కేంద్రాలు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడూరు మండలంలో ఉన్నాయి. విద్యార్థుల అవస్థలు, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు కళాశాల ఖర్చులతో బస్సును ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో బుధవారం నుంచి ఎమ్మిగనూరు డిపోకు చెందిన బస్సును ప్రతిరోజు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్‌ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ప్రారంభం కావడంతో విద్యార్థులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో పరీక్ష కేంద్రాలకు తరలించారు.

టీకాలు సకాలంలో అందించండి

సి.బెళగల్‌: బాలలకు టీకాలను సకాలంలో అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్‌ అధికారి (డీఐఓ) డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోలకల్‌ గ్రామ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు, విధులను తనిఖీ చేశారు. అదేవిధంగా రోగుల వివరాలు, అందుబాటు లో ఉన్న ఔషధ నిల్వలు, పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న వైద్య సేవలను స్థానిక వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో చేపట్టిన చిన్న పిల్లలకు టీకా కార్యక్రమాన్ని పరిశీలించిన వైద్య సిబ్బందికి సూచనలు చేస్తూ, నిర్ణీత కాలంలో బాలబాలికలకు టీకాలను ఇవ్వడంతో వారిలో రోగ నిరోధక శక్తి పెంపొంది జబ్బులబారిన పడకుండా ఉంటారన్నారు.

గూడూరు రూరల్‌: జూలకల్‌లోని ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం పిల్లలకు ఆరోగ్య సిబ్బంది వేస్తున్న



పోలకల్‌ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌

టీకాల కార్యక్రమాన్ని డీఐఓ డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పుట్టిన బిడ్డ మొదలుకొని స్కూళ్లకు వెళ్లే పిల్లలకు ప్రాణాంతకమైన వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వేయాలన్నారు. టీకా ఇచ్చిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు, డాక్టర్లు హేమ సుందర్‌, శివకుమార్‌ ఉన్నారు.



కోడుమూరు జూనియర్‌ కళాశాల వద్ద పరీక్షా గదులను చూసుకుంటున్న విద్యార్థినులు

తొలిరోజు ప్రశాంతం

కోడుమూరు రూరల్‌: మండలంలో ఇంటర్మీడియెట్‌ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్‌ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన తెలుగు, హిందీ, ఇతర లాంగ్వేజ్‌ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో 183 మందికి గాను 10 మంది గైర్హాజరుకాగా, మోడల్‌ స్కూల్‌లో 183 మందికి గాను 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్‌ సూపరింటెండెంట్లు పద్మావతి, ఆశాజ్యోతి తెలిపారు.

సత్వర వైద్యం అందించండి

కర్నూలు(హాస్పిటల్‌): క్యాజువాలిటీకి వచ్చిన రోగులు, క్షతగాత్రులకు సత్వరం వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌ డాక్టర్‌ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని పేయింగ్‌ బ్లాక్‌, సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌, ఆర్థోపెడిక్‌, ఎంఎస్‌ఎస్‌, ప్లాస్టిక్‌ సర్జరీ, క్యాజువాలిటీ తదితర విభాగాలను సందర్శించారు. ఎంఎస్‌ఎస్‌, ప్లాస్టిక్‌ సర్జరీ విభాగాల్లో బయోమెడికల్‌ వేస్టేజ్‌ డబ్బాలను పరిశీలించి అక్కడున్న నర్సింగ్‌ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సింగ్‌ సిబ్బంది ప్రతి విభాగాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పసుపు, తెలుపు, నీలం రంగు డబ్బాల్లో బయోమెడికల్‌ వేస్టేజ్‌ వేయాలని చెప్పారు. అనెస్తీషియా విభాగంలో పలు సమస్యల గురించి హెచ్‌ఓడీతో చర్చించారు. వైద్యులు, పీజీలు, టెక్నీషియన్ల విధుల గురించి ఆరా తీశారు. వీరికి ప్రతి విభాగంలో డ్యూటీ రోస్టర్‌ వేసి విధులు నిర్వహించేలా బాధ్యత తీసుకోవాలని హెచ్‌ఓడీకి సూచించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది డ్రెస్‌ కోడ్‌, ఐడీ కార్డు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. క్యాజువాలిటీలో వైద్యులతో మాట్లాడి అత్యవసర కిట్లు, సదుపాయాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కొత్త ఐపీ బ్లాక్‌ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్‌ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్‌ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్స్‌ డాక్టర్‌ శివబాలనాగాంజన్‌, డాక్టర్‌ కిరణ్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.



క్యాజువాలిటీలో వివరాలు సేకరిస్తున్న డాక్టర్‌ నరేంద్రనాథ్‌రెడ్డి

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు: కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన మంగలి పెద్దయ్య (60) రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతిచెందాడు.ఈయన కులవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ద్విచక్ర వాహనంపై మంగళవారం సాయంత్రం కర్నూలుకు వచ్చి కులవృత్తికి సంబంధించిన సామాన్లు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కృష్ణానగర్‌ ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించగా కోలుకోలేక మృతి చెందాడు. ట్రాఫిక్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్‌: పేదల అభ్యున్నతికై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంపై మండల పరిషత్‌ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌ సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన ఎంపీడీఓ రాముడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ అమల్లో ఉండటంతో జిల్లా కలెక్టర్‌ కోటేశ్వరరావు అనుమతులతో సమావేశం నిర్వహిస్తున్నామని, ఎలాంటి తీర్మానాలుగానీ, అభివృద్ధి నిర్ణయాత్మక ప్రకటనలు చేయడం జరగదని వెల్లడించారు. అనంతరం ఆయా శాఖలలో చేపట్టిన అంశాలు, నివేదికలను అధికారులు చదివి వినిపించారు.



సి.బెళగల్‌ మండల మీట్‌లో సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

ఎంఈఓ జ్యోతి మాట్లాడుతుండగా.. సి.బెళగల్‌, కొత్తకోట సర్పంచ్‌లు పాండురంగన్న, శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్‌ ఎస్‌ఎం బాష తదితరులు స్పందిస్తూ ప్రభుత్వం పేద విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పౌష్టికరంగా అందించేందుకు చర్యలు చేపట్టిందని అయితే ఈ పథకంపై సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని, కొందరు ఇంటికి వెళ్లి భోజనం చేసి వస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని రెండు పీహెచ్‌సీలలో నలుగురు వైద్యులు ఉన్నప్పటికీ రోగులకు అందుబాటులో ఉండటం లేదని సభ్యులు ఆరోపించారు. మండల సమావేశానికి సైతం నలుగురు వైద్యులు గైర్హాజరు కావడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ ఎంపీడీఓను ఆదేశించారు. హౌసింగ్‌, రెవెన్యూ, ఆర్టీసీ, రక్షణాంశాలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. వైస్‌ ఎంపీపీ నాయకంటి మంగమ్మ, తహసీల్దార్‌ శివశంకర్‌నాయక్‌, ఎస్‌ఐ పీరయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ప్రయోజనం

కర్నూలు (న్యూటౌన్‌): కర్నూలు మండలంలో భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న వివాదాలకు సంపూర్ణ పరిష్కారంతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కర్నూలు రూరల్‌ ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ శివరాముడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను అందజేస్తామని తెలిపారు. రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్‌ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 72673.59 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయ్యిందని వెల్లడించారు. రీసర్వేకు సంబంధించి ఆయా గ్రామాల్లో ముందస్తుగా దండోరా వేయించి రైతులకు సమాచారం అందిస్తున్నామన్నారు. పీఓఎల్‌ఆర్‌ డీటీ శారద, వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

21న బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఈ నెల 21న అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ మల్లెల రాజశేఖర్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు తొలి ఆరు స్థానాలకు వరుసగా రూ.లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 83091 65221 సెల్‌ నెంబర్‌ను సంప్రదించాలని కమిటీ సభ్యులు సూచించారు.

పాదయాత్రికులకు అన్నదానం

గూడూరు రూరల్‌:శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న కర్ణాటక భక్తులకు మండల పరిధిలోని పెంచికలపాడులో ఉన్నత అన్నదానశిబిరాన్ని బుధవారం గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి గూడూరు,కోడుమూరు మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్న వేలాదిమంది భక్తులకు స్థానిక ప్రజల సహకారంతో అన్నదానం చేశారు. ఐదు రోజులుగా అన్నదానం చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

గణనీయంగా పన్ను వసూళ్లు

కల్లూరు: మండలంలో ఇంటి పన్నుల వసూలు ఘననీయంగా నమోదైంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 18 గ్రామ పంచాయతీ పన్ను వసూలు లక్ష్యం రూ.44,13,079 కాగా పాత బకాయిలతో కలుపుకుని మొత్తం రూ.60,99,186గా నిర్దేశించారు. అయితే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి మార్చి 14వ తేదీ నాటికి పాత బకాయిలతో కలుపుకుని రూ.44,62,637 (73 శాతం) వసూలైంది. మూడు గ్రామ పంచాయతీలలో పాత బకాయిల మొత్తం రూ.1,30,532 ఉండగా మిగతా 15 గ్రామ పంచాయతీలలో ఎలాంటి బకాయిలు లేవు. ఇంకా వసూలు కావలసిన పన్ను మొత్తం రూ.16,36,549 ఉంది. మండలంలో కె.మార్కపురం 98.88 శాతం, పుసులూరు 98.15 శాతం, నెరవాడ 97.84 శాతం, యాపర్లపాడు 96.24 శాతం, తడకనపల్లె 92.12 శాతం, రెమడూరులో 91.14 శాతం పన్ను వసూలైంది. చిన్నటేకూరు గ్రామ పంచాయతీ 64.84 శాతంతో వెనుకబడింది. మిగిలిన గ్రామ పంచాయతీలలో 70 శాతానికి పైగా పన్ను వసూలైంది.

లక్ష్యం చేరుకుంటాం

గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లలో ఆర్థిక సంవత్సరం (మార్చి) చివరి నాటికి లక్ష్యం చేరుకుంటాం. గ్రామ సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి త్వరగా ఇంటి పన్నుతో పాటు ఇతరేతర పన్నులు కూడా వసులు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి గ్రామీణాభివృద్ధికి సహకరించాలి.

– రవికిషోర్‌, ఈఓఆర్డీ, కల్లూరు

ప్రతిభ ఆధారంగా సీటు



నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల రెసిడెన్షియల్‌ పాఠశాల

- జిల్లాలో జ్యోతిబాపూలే పాఠశాలలు - 6
- మొత్తం సీట్లు - 440
- ప్రవేశ తరగతి - 5
- దరఖాస్తుల స్వీకరణః మార్చి 5 నుంచి ఏప్రిల్‌ 4వ తేదీ వరకు

పాణ్యం: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఇకపై శ్రమించాల్సిందే. ఇప్పటివరకు లాటరీ పద్ధతిలో జరిగిన ప్రక్రియ ఇకపై ప్రతిభ ఆధారంగా జరగనుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 5వతేదీ నుంచి ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

4వ తరగతి స్థాయిలో..

ఈ ఏడాది నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో నాలుగవ తరగతి స్థాయిలో తెలుగు–10, ఆంగ్లం–10, గణితం–15, పరిసరాల పరిజ్ఞానం (సైన్స్‌, సాంఘికం)–15 ప్రశ్నల చొప్పున ఉంటాయి. ఆబ్జెక్టివ్‌ విధానంలో పరీక్షను రెండు గంటల్లో రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు జవాబులను ఓఎంఆర్‌ షీట్‌లో గుర్తించాలి.

రిజర్వేషన్లు ఇలా..

పాఠశాలలోని మొత్తం సీట్లలో 74 శాతం బీసీ విద్యార్థులకు కేటాయించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం కేటాయించారు. అనాథ విద్యార్థులకు 3 శాతం ఈబీసీ విద్యార్థులకు 2 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు.

ఖాళీలు ఇలా..

నంద్యాల జిల్లా పరిధిలో 6 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బాలురు శ్రీశైలం (160), ఇ.కొత్తపేట (40), బేతంచెర్ల (80) చొప్పున ఈ ఏడాది భర్తీ చేయనున్నారు. బాలికల పాఠశాలలు ఆళ్లగడ్డ (40), నెరవాడ (80), డోన్‌ (40) సీట్లను భర్తీ చేస్తారు.

ఆన్‌లైన్‌లో మాత్రమే

ఈ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. హెచ్‌టీటీపీఎస్‌//ఎంజేపి ఏపీబీసీ డబ్ల్యుఆర్‌ఈఐఎస్‌. ఏపీ ఎసీఎఫ్‌ఎస్‌ఎస్‌.ఇన్‌ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. రెఫరెన్స్‌ నంబర్‌తో దరఖాస్తు నమూనా కాపీని ప్రింట్‌ తీసుకోవాలి. పాఠశాలలో నేరుగా దరఖాస్తు ఇస్తే అనుమతించరు. హాల్‌ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకోవాలని జ్యోతిబాపూలే పాఠశాలల జిల్లా కన్వీనర్‌ జయమ్మ తెలిపారు.

ఎల్లెల్సీ కింద కళకళలాడుతున్న పైర్లు



గూడూరులో సాగు చేసిన మొక్కజొన్న



చనుగొండ్ల సాగు చేసిన కొర్ర పైరు

గూడూరు రూరల్‌: ఎల్లెల్సీ కాలువ కింద రైతులు సాగు చేసిన పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. గత మూడేళ్లుగా మంచి వర్షాలు కురుస్తుండటంతో నీటి పారుదల శాఖ అధికారులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సక్రమంగా సాగు నీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎల్లెల్సీ కింద సాగునీటిని అందిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, కొర్ర, గోధుమ, తదితర పంటలను 3,600 ఎకరాల్లో సాగు చేశారు. ఎల్లెల్సీ కాలువకు అధికారులు సక్రమంగా నీటిని వదులుతుండటంతో పంటలకు రెండు నుంచి మూడు నీటి తడులు అందాయి. సాగు చేసిన పంటలు బాగా ఎదిగి దిగుబడుల దశకు వచ్చాయి. గతంలో ఎల్లెల్సీ కాలువకు సక్రమంగా నీరు వచ్చేది కాదని మూడేళ్లుగా కాలువకు నీరు సమృద్ధిగా వస్తుండడంతో పంట పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సాగునీరు అందించనున్నట్లు నీటి పారుదల శాఖ డీఈ లక్ష్మణ్‌కుమార్‌ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు (టౌన్‌): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలకు రెండు వారాల పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్‌ అథారిటీ సీఈఓ రమణ స్పష్టం చేశారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో మహిళలు, యువతులకు 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, టెన్నికాయిట్‌, లెమన్‌- స్పూన్‌, శాక్‌వాక్‌ (గోనె సంచులు కట్టుకొని నడవడం), షాట్‌పుట్‌ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇటీవల క్రీడల్లోనూ మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిందన్నారు. క్రీడలతో పాటు మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. స్పోర్ట్స్‌ అథారిటీ చీఫ్‌ కోచ్‌ నటరాజ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి పోటీలు : స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో గురువారం ఉదయం 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌, జావెలిన్‌ త్రో పోటీలు నిర్వహించనున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఈఓ రమణ ఒక ప్రకటనలో తెలిపారు.